





# మేలుకొలుపు స్వరం

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక


**2011**

**మార్చి - ఏప్రిల్**

సంపుటి : 2 సంచిక : 5



ప్రధాన సంపాదకులు

**డా॥ బి. రవికుమార్**

ఉప సంపాదకులు

**శ్రీమతి అరుణ రవికుమార్**



చందా వివరములు

సంవత్సర చందా రూ. 100/-

పోషక చందా. 500/-

జీవిత చందా. 1000/-

డిటిపి/గ్రాఫిక్స్

గ్రేస్ గ్రాఫిక్స్, విజయవాడ

ఫోన్ : 0866-2530841



**మా చిరునామా**

సంపాదకులు, **మేలుకొలుపు స్వరం**

**16 వ వార్డు, నిడదవోలు-534 301, ప.గో.జిల్లా**

**ఫోన్: 08813-221612, సెల్: 98491 84346**

**Email : melukolupuswaramu@gmail.com**

**website : emmanuelministries.org.in**


## లోపలి పేజీల్లో


**2** వ పేజి
సంపాదకీయము



**3** వ పేజి: కవచము ధరించిన స్త్రీ
అరుణ రవికుమార్



**5** వ పేజి: గిద్యోను
బి. రవికుమార్



**7** వ పేజి: రూపాంతరం
ఐ. శ్యామ్‌బాబు



**11** వ పేజి: లిటిల్ హార్ట్స్
బ్లెస్సి-ప్రిన్సి


**12,13** వ పేజీలు:
సేవా చిత్రమాలిక



**14** వ పేజి:
జపాన్ జ్ఞానం బాబేలు గోపురం



**18** వ పేజి:
మీకు తెలుసా
అరుణ రవికుమార్



**20** వ పేజి:
స్వస్థత శాలలో క్రీస్తు మహిమలు



**22** వ పేజి:
ఒకే పేరుగల అనేకులు

**23** వ పేజి:
బైబిల్ క్విజ్
బైబిలు ప్రదేశములు

**24** వ పేజి
ప్రకటనలు

# సంపాదకీయం

## దతవవతతదద



రెవ।। బి. రవికుమార్

సంవత్సరానికి ఒక సారి వచ్చే పండుగా? పిండి వంటలు, నూతన వస్త్రాలు, గృహ అలంకరణలతో ఆచరించే సంప్రదాయమా? లేక విందు వినోదాలతో విచ్చల విడిగా జీవించే శుభ కార్యమా? క్రీస్తుకు సంబంధించిన ఒక విశ్వాసి క్రిస్మమస్‌ను ఏ నేపథ్యంలో చూడాలి, ఏ విధంగా పరిగణించాలి?

లోకమంతా క్రీస్తు ప్రభువు జన్మదినంగా స్మరణ చేస్తుంది. అవును, పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు జన్మించిన రోజు! అయితే ఆయన 2011 సం"ల క్రిందటే జన్మించాడు, అనేకుల కొరకు రక్తం చిందించి చనిపోయాడు, మరల 3వ దినాన తిరిగి లేచాడు. మరలా మరలా ఆయన పుట్టనవసరం లేదు, మరలా మరలా ఆయన మరణించనవసరం లేదు, మరలా మరలా తిరిగి లేవనవసరమూ లేదు. అదంతా జరిగిపోయిన సంభవాలు! ఇపుడు పుట్టాడని ఊయలలలో వూపుతూ జోల పాటలు పాడనవసరం లేదు. శరీర రీతిగా జీవించియున్న దినాలలో ఆయన ఏమిచేశాడో, ఇపుడున్న మనం ఏమి చేస్తే ఆయన సంతోషిస్తాడో అలాగు చేస్తేనే ఆయనకు ఆనందం!

మనం మన కోసం బ్రతకడమే కాదు, ఇతరుల కోసం కూడ బ్రతకాలి. దీనే బైబిలు "నిన్ను నీవు ఎలా ప్రేమించుకుంటున్నావో అలాగే నీ చుట్టు ప్రక్కల నున్న వారి కూడా ప్రేమించు" అంటుంది. ఒక చెట్టు తాను బ్రతకడమే కాకుండా ఇతరులకు తన ఫలాలను ఇస్తుంది, తన నీడకు వచ్చు వారికి ఆశ్రయం కల్పిస్తుంది. క్రిస్టమస్ ఆచరించటం క్రియపూర్వకంగా అలా జరగాలి. మనం పండకు తినడం, మనం క్రొత్త దుస్తులు ధరించడం, మనం మాత్రమే సంతోషించడం కాదు. దాన్ని యితరులకు కూడా పంచాలి, అదే క్రిస్మస్!

దిక్కులేని వారిని, దరిద్రులను, బిక్షాటన చేయువారిని, విధవరాండ్రను, నిరాధారులను జ్ఞాపకం చేసుకోవాలి. నేను నా సంఘ సభ్యులతో కలిసి క్రిస్మస్ దినాలలో రోడ్ల వెంబడి, చెట్ల క్రింద, పుట్ల వద్ద నివాసం చేసే వారి యొద్దకు, రైల్వే బస్టాండ్‌లలో తిరుగులాడు వద్దకు వెళ్ళి వారిని తట్టి లేపి బట్టలు, పండ్లు, మిఠాయిలు పంచి క్రీస్తు ప్రేమను ఆయన మాటలను అందించి శుభాకాంక్షలు తెలియజేస్తాము. అది మాకు ఎంతో తృప్తి నిస్తుంది. మా పరిధిలో మా కున్నంతలో చేయగలిగిన చేస్తూ అలాగున క్రిస్మస్ ఆనందాన్ని అనుభవిస్తుంటాము.

క్రిస్మస్ అంటే క్రైస్ట్ మాస్ (క్రీస్తు ఆరాధన). పండుపరమైన సాంఘిక సేవ చేస్తూ ప్రభువా మా కొరకు ఈ లోకానికి అరుదెంచావన్న కృతజ్ఞతా భావంతో ఆయనను ఆరాధించాలి. ఘనపరచాలి, స్తుతించాలి, పూజించాలి, కొనియాడాలి. మనం ఈ లోకంలో ఏది చేసినా ఈ సంగతి ద్వారా ప్రభువు సంతోషిస్తున్నాడా? లేడా? అన్నిపునార్విమర్శ కలిగి యుండాలి. ఇంతకు మించి లోకాను సారంగా పండుగ ఆచరిస్తే దండగ అవుతుంది. ప్రభువు వారసులముగా క్రిస్టమస్ చేయుట యందు విఫలులైనట్లే! మనకున్నంతలోనే కాస్తంతైనా దాని పొందదగిన వారికి చేద్దాం!

క్రిస్మస్ ఆశీస్సులు మీకెల్లరకు కలుగును గాక!





శ్రీమతి అరుణ రవికుమార్

# సర్వాంగ కవచము

## 2. నీతియను మైమరువు

ప్రభువునందు ప్రియమైన 'మేలుకొలుపు స్వరం' సహోదరీలందరికి మన ప్రభువైన యేసు క్రీస్తు నామంలో శుభాభివందనములు. అమ్మా! ఎలా ఉన్నారు? ఈ పత్రిక మీకు ఆదరణను, ఆత్మీయతను కలిగిస్తుందని తెలుసుకొని మేమెంతో సంతోషిస్తున్నాం. గత సంచికలలో మొదటిగా సర్వాంగకవచమును గురించి విపులంగా తెలుసుకున్నాం. తరువాత సర్వాంగ కవచములో మొదటిది సత్యమను దట్టి గురించి తెలుసుకున్నాం (ఎఫెస్సీ 6:14). ఈ పత్రికలో రెండవది నీతియను మైమరువును గూర్చి తెలుసుకుందాం.

మన జీవన పోరాటంలో, ఆధ్యాత్మిక జీవితంలో సాతాను యొక్క తంత్రములను యెరిగి, వాడిని జయిస్తూ, ముందుకు సాగిపోతూ ఉండాలి. వాడిని గెలవాలి అంటే మనం కొన్ని ఆయుధాలను ధరించ వలసినవారమై ఉన్నాం. అయితే ఆ ఆయుధాలు దేవుడిచ్చినవై ఉండాలి (ఎఫెస్సీ 6:11). సత్యమనే దట్టిలో యదార్థత, నమ్మకం, నిజాయితీ యివి హన్నా జీవితంలో నుండి తెలుసుకున్నాం. రెండవది "నీతియను మైమరువు" ఈ ఆయుధాన్ని మనం తొడుగుకోవాలని ఉంది. అనగా మనం తల నుండి కాళ్ళ వరకు ఈ ఆయుధాన్ని తొడగవలసిన వారమైయున్నాం. నీతి అనగా పరిశుద్ధత. మనం పుట్టుకతో పాపులం (కీర్తన 57:5). నీతిమంతుడు లేదు, ఒక్కడును లేదు (రోమా 3:11). అంటే మన మందరము జన్మతహా, క్రియతహా పాపులం. అటువంటి మనం ప్రభువారు ప్రేమించి ఆయన పరిశుద్ధ రక్తము ద్వారా మనలను, మన పాపములను (ఒప్పుకొని, విడిచిపెట్టిన యెడల) కడిగి మనలను ఆయన నీతిమంతులుగా మార్చారు. కనుకనే "నేను పరిశుద్ధుడైన ప్రకారం, మీరును పరిశుద్ధులై యుండుడి" (1 పేతురు 1:14) అని ఆయన చెప్పారు. మనం ఆయన రాజ్యమందు చేరాలని, దేవుని కనికరం నిత్యం మనపైన ఉండాలని నిరంతరం ప్రభువు మనకిచ్చిన పరిశుద్ధతను కాపాడుకుంటూ ఉండాలి.

క్రైస్తవ జీవితంలో అతి ప్రాముఖ్యమైనది పరిశుద్ధత లేదా నీతి. అందుకే దేవుని వాక్యములో ముందుగా దేవుని రాజ్యమును, ఆయన నీతిని వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహింపబడును అని ఉంది. మనం ఆయన చిత్త ప్రకారం జీవిస్తూ ఉంటే ఈ లోకంలో మనకు ఏది కావలసివచ్చిన అవన్నియు ప్రభువే మనకు అనుగ్రహిస్తుంటారు. నీతి అనే మైమరువును ధరించి ఉంటే సాతాను మనలను తాకలేదు. ఈ నీతి మనం దేవుని రాజ్యం చేరేవరకు మనలను కాపాడుతుంది. మనం అలాగే జీవిస్తూ ఉండాలి. అంటే మనం రక్షింపబడిన నాటినుండి మన జీవిత కాలమంతా ఆయన చిత్త ప్రకారం జీవిస్తూ, పరిశుద్ధత కలిగి, ఆయనతో కలసి జీవిస్తూ

ఉండాలి. అలాగ ప్రభువు దయను పొంది రక్షింపబడి, అన్ని విషయాలలో ప్రభువును వెంబడించిన స్త్రీని మనం చూద్దాం.

లూకా 8:2లో మగ్దలేనే అనబడిన మరియ కన్పిస్తుంది. ఈమెలో ఏడు దయ్యములు ఉండేవి. వాటిని ప్రభువారు ఈమె నుండి వదలిపోగొట్టారు. దయ్యాలతో సహవాసంలో ఉండే ఈమె ఇప్పుడు దేవునితో సహవాసం చేస్తుంది. ఒకప్పుడు అనీతిమంతురాలు, ఇప్పుడు నీతిమంతురాలు ఎప్పుడైతే దేవునితో సహవాసం కలిగి ఉందో, దయ్యములు పారిపోయాయి. అవును దేవుని బిడ్డా! ఎప్పుడైతే దేవుడిచ్చే సర్వాంగ కవచమును ధరించుకొంటామో అపవాది తంత్రములపై మనం విజయం పొందుతాము. ప్రభువారిని కలిగి ఉండి నిత్యం ఆయన వెంటే ఉండి యేసు ప్రభువారి అనుచరురాలైంది. నీతి యుక్తమైన జీవితం కలిగి ఉంది. ప్రభు కొరకు తన ఆస్తిలో ఉపచారము చేసింది (లూకా 8:3) అనగా తన బ్రతుకును మార్చిన ప్రభువు యెడల కృతజ్ఞత కలిగి ఉంది. ప్రభువు వారు సిలువను మోసేటప్పుడు, సిలువపైన మరణం పొందేటప్పుడు కూడా ఆయన వెంటే ఉంది (మత్తయి 27:56). అంతే కాదు ప్రభువు వారు చనిపోయిన తరువాత ఆయనను సమాధిలో ఉంచి, పెద్దరాయి అడ్డుగా ఉంచి అందరూ వెళ్ళిపోతే, సమాధి ఎదురుగా ఆ ప్రాంతములో మగ్ధలేనే మరియ కూర్చుని ఆయనను కనిపెట్టుకొని ఉంది (మత్తయి 27:61). ప్రభువారు సమాధిలో ఉన్నారనుకొని ఆయనను అభిషేకించడానికి మూడవ రోజున ఉదయమునే, ఇంక చీకటిగా ఉండగానే అక్కడకు వచ్చి రాయి ప్రక్కకు దొర్లించబడి ఉందని చూసి, పరుగున సీయోను పేతురు దగ్గరకు వెళ్ళి చెప్పింది (యోహాను 20:1,2) అనగా ఆయన తిరిగి లేవడం మొదటిగా మగ్ధలేనే మరియకే తెలుసు.

అంతకంటే ప్రాముఖ్యం తిరిగి మరలా సమాధి దగ్గరకు వచ్చి ధైర్యంగా సమాధిలోకి వంగి ప్రభువు దేహం కన్పించలేదని ఏడ్చింది. అంటే ఆయన నిత్యం నాకు కనబడాలి అనే అభిలాష. అక్కడ ఇద్దరు దేవతలను చూసింది. వారు ప్రభువును గురించిన వర్తమానం ఆయన తిరిగి లేచారని మొదటిగా మగ్ధలేనే మరియకే తెలిపారు. ఆయన పునరుత్థాన రూపం కూడా మగ్ధలేనే మరియయే మొదటిగా చూసింది కాని గుర్తుపట్టలేదు. ఆమె పరిశుద్ధురాలిగా జీవించింది కనుకనే పరిశుద్ధుని చూడగలిగింది. కాదు పరిశుద్ధుడే ఆమెకు అగపరచుకున్నారు (యోహాను 20:11-14). ఎంత అద్భుతం ఎంతో మంది ఆయనను ప్రేమించిన శిష్యులు ఉన్నారు. ఆమెను కన్న తల్లి మరియ ఉంది, కాని ప్రభువు పాపిగా జీవించి ప్రభువు పాదాల దగ్గరకు వచ్చి జీవితాన్ని మార్చుకొని తనలో ఉన్న దయ్యాలను ప్రభువు ద్వారా వదిలించుకొని, ప్రభువు వలనే నాకు విమోచన కలిగింది అని, నిత్యం స్తుతిలో, కృతజ్ఞతతో ప్రభువైపే ఆమె కనులెత్తి చూస్తూ ఉంది కనుక కడవరకు ఆయనను వెంబడించింది. నీతి కొరకు ఆకలి దప్పులు కలవారు ధన్యులు వారు తృప్తిపరచబడుదురు (మత్తయి 5:6). దేవుని కనికరం పొందింది కనుక ఆయన సజీవునిగా ఉన్నప్పుడు ఆయన వెంట ఉంది పునరుద్ధానుడుగా ఉన్నప్పుడు ఆయన దర్శనం పొందగలిగింది. జీవితంలో తృప్తిపరచబడింది.

అవును తల్లీ, నీతి అనే మైమరువు రక్షింపబడిన మన అందరికీ అవసరం. మన ఆత్మీయత నీతియే (పరిశుద్ధ) ఆయనను చూడాలంటే పరిశుద్ధత కావాలి. మనం సమస్త శత్రుకార్యాలను గెలవాలంటే మనం ధరించవలసిన అతి ప్రాముఖ్యమైన కవచము మనలను కప్పి ఉంచే నీతి అను మైమరువు. మనలో అనగా అన్ని విషయాలలో ఎప్పుడైతే నీతి (పరిశుద్ధ) కలిగి ఉంటామో అనగా ఆయన స్వభావమును యెరిగి ఆయనలో ఎప్పుడైతే జీవిస్తూ ఆయనను వెంబడిస్తామో అప్పుడు దయ్యపు శక్తులు విరోధ ఆత్మలు, శత్రుకార్యాలు మన నుండి పారిపోతాయి. మీరు కూడా ఆయనను నిత్యం వెంబడించి ఆయన దయను పొందుదురు గాక! దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమేన్.

## ఉదక స్నానము - మురికి పరార్

ఒక కుటుంబంలో ఒక తల్లిగారు ప్రతి మీటింగ్‌కి వెళ్ళిపోతూ ఉంటాదట. ఆ ఇంట్లో వాళ్ళు అస్సలు నీకు ఏమి అర్థమైందో లేక నీవు ఏమి నేర్చుకున్నావో తెలుసుకుందామని అని అన్నారు. అస్సలు నీవు విన్న ఒక వాక్యం చెప్పు అని వాళ్ళ అబ్బాయి అన్నాడట. నాకు ఏమి తెలుసురా? ఎలా చెప్పను కాని ఆ పాస్టరు గారు మాత్రం చాలా బాగా చెప్పారు అన్నాడట. ఏమి తెలియని నీవు ఇంకెందుకు ప్రార్థనకు వెళ్ళటం అదిగో ఆ మూలన తగిలించిన వైరు బుట్టలాగా నీ హృదయం అంతా చిల్లులే అందులో ఎన్ని నీళ్ళు వేసినా, లేకపోతే ఎన్ని నీళ్ళలో ముంచిలేపిన ఒక చుక్కకూడా ఆ బుట్టలో ఉండవు. అలాగే నీవు వాక్యం వినటం కూడా అలాగే ఉంది. మరలా చాలా బాగుంది అంటున్నావు అని అన్నాడట వాళ్ళబ్బాయి.

వెంటనే తల్లి సరేరా ఆ వైరు బుట్ట ఇలాగ ఇవ్వు అని చెప్పిందట ఆ బుట్టను తీసుకొని నీటిలో నాలుగైదుసార్లు ముంచిందట. కుమారుడు నవ్వి నీ హృదయంలో వాక్యంలో లేనట్టు దానిలో కూడా నీళ్ళు ఉండవు అన్నాడట. వెంటనే ఆ తల్లి సరేరా నీళ్ళైతే నిలవలేదు కాని ఆ వైరు బుట్టకు ఉన్న మురికంతా పోయింది చూడు అన్నాడట.

అవును దేవుని వాక్యం వింటూ ఉంది. ఆ వాక్యం అద్దము వలె మన జీవితాన్ని ఎత్తి చూపిస్తూ మనలను సరిచేస్తుంది.

# క్రిస్మస్ ధన్యతలు




**డా॥ బి. రవి కుమార్**

పాఠకులకు క్రిస్మస్ శుభాశీస్సులు. క్రిస్మస్ అంటే దేవుడు మన మధ్యకు రావడం. ఆయన అనంతుడు. మనం అల్పులం, ఆయన మొదటి క్రిస్మస్ రోజున ఒక ఆచారంగా జరుపుకునే వేడుక. మరి కొంతమంది దృష్టిలో బహుమతులు ఇచ్చిపుచ్చుకునే రోజు. కానీ క్రిస్మస్ వీటన్నింటిని మించిన రోజు, ప్రపంచమంతా ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ క్రీస్తు జన్మ. ప్రపంచమంతా ఎంతో పండుగ ఇది. క్రీస్తు జన్మ అనంతుడైన దేవుణ్ణి పరిమితి గల మానవ పరిధిలోనికి తెచ్చింది.

క్షణం తీరికలేని పనులతో సతమతమౌతున్న (బ్రెజిల్) దేవుడు కాస్త విశ్రాంతిగా ఉంటుందని ఒకసారి సెలవుమీద భూమి మీదికి వచ్చాడట. అప్పుడు డబ్బుకోసం నానా అగచాట్లు పడుతున్న ఒక యువకునికి నమ్మబుద్ధి మధ్య ఈ సంభాషణ జరిగిందట. ఆ వచ్చినవాడు దేవుడంటే ఆ యువకునికి నమ్మబుద్ధి కాలేదట. ఏదైనా మాయలు చేసి చూపమంటే “నేను దివినుంచి భుమికి దిగి వచ్చాను అంతకంటే ఏం మాయ కావాలని” ప్రశ్నిస్తాడు. పోనీ ఆ దేవుడు వేషభాషలు చూద్దామా అంటే అంతంత మాత్రమే. పాతబట్టలు, నెరిసిన గడ్డం. ఎదురుపడిన దేవునితో మాట్లాడకపోతే ఎలా? పాపం, దేవుడు నొచ్చుకోడూ? చివరికి ఆ యౌవనస్థుడు మాయలు చేయకపోతే పోయావుగాని, సృష్టి ఏర్పడినప్పుడు ఏం చేసావో చెప్పు. అని అడుగుతాడు. “అబ్బే నేను చేసిందేమీ లేదు. అన్నీ జరుగుతుంటే జరగనిచ్చాను” అని తాపీగా సమాధానమిస్తాడు. ఆ యువకునిలో దేవునితో మాట్లాడుతున్న ఎక్సైట్‌మెంటే పోయింది. ఇదివరకోకసారి సముద్రాన్ని రెండుగా చీల్చావటగా అని అడుగుతాడు. అబ్బే ఒక ఉల్క సముద్రం మీద పడినపుడు చీలింది, అంతే. అని అందులో తన క్రెడిట్ ఏమీ లేదన్నట్టు చెబుతాడు. అదేమిటి, మరి నీవేం చేశావు దేవుడూ? అంటే, “అసలు ఏదైనా నేను ఎందుకు చెయ్యాలి? సృష్టించాను చాలదా! హాయిగా గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించవచ్చుకదా! అన్నిటికి నా మీదే ఆధారపడతారేమిటి మీ మానవులు? దేవుడా! నన్ను చల్లగా చూడు. దేవుడా నాకు అది చెయ్యి ఇది చెయ్యి అంటారు? ఏమిటిది? ఆఖరికి నాకు సంబంధంలేని విషయాల్లో కూడా ఓ మైగాడ్! అని మాటిమాటికి అంటుంటారు. మీ పనులు చేయడమేగా నా పని” అని కోప్పడ్డాడట దేవుడు. ఆ మానవుడు బిత్తరపోయాడు.

పై విషయం ఆలోచిస్తే చాలా విచిత్రంగా వుంది కదూ! అవును, అది బ్రెజిల్‌లో నున్న ఒక దేవుడి కథ. అయితే మన దేవుడు ఈ లోకానికి రావడం ఒక మహిమాన్విత సంఘటన. దివినుండి భువికి యేసుక్రీస్తు రూపంలో ఆయన ఒక మానవ కుటుంబంలో సభ్యుడై మనస్థాయికి దిగివచ్చిన దేవుడాయన. దేవుణ్ణి మనకు బయలుపర్చటానికి క్రీస్తు వచ్చాడు. పాపరహిత జీవితాన్ని జీవించి, ప్రాయశ్చిత్తమైన మరణాన్ని వరించి మన రక్షణార్థం సమాధిలో నుండి తిరిగి లేచాడు. “చెప్ప శక్యముకాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము” (2 కొరింథీ 9:15). ఆయన “దేవుని

... తత్త్వము యొక్క మూర్తిమంతము" అని బైబిల్ వివరిస్తుంది. క్రిస్టన్ మనకొనగిన దీవెనలేమిటి – ధన్యతలేమిటి ఆలోచిందాం.

1. క్రిస్మస్ మనకు ఘనత / గౌరవం/ హోదా/ దర్జా/ పరువు నిచ్చింది

ఒకప్పుడు మన మూతికిముంత వెనకాల తాటాకు కట్టుకుని నడిచేవారమని పెద్దలు చెప్తుంటారు. అలాంటి మనకు నేటి సమాజంలో ప్రభువుని బట్టి ఘనత కల్గింది. "దరిద్రులను అధికారులతో కూర్చుండ బెట్టుటకును మహిమగల సింహాసనమును స్వతంత్రింపచేయుటకును వారిని మంటిలో నుండి ఎత్తువాడునూ ఆయనే. లేమిగల వారిని పెంటకుప్ప మీద నుండి లేవనెత్తువాడు ఆయనే" (1 సమూ 2:8). ఈ లోకసంబంధమైన గొప్ప గొప్ప వ్యక్తులతో కూర్చునే అవకాశం దొరికింది. అంతేకాదు, ప్రభువు పరిచర్యలో సహితం గొప్ప గొప్ప సేవకులతో కలిసి పరిచర్య చేసే భాగ్యం దొరికింది. గౌరవం పెరిగింది. సమాజంలో దర్జా పెరిగింది. కేలం క్రీస్తును బట్టే ఈ ఘనత. దరిద్రులను అధికారులతో కూర్చుండబెట్టడం. పరలోక సింహాసనం మీద కూర్చునే ఆధిక్యత (ఎఫెసీ 2:7) లభించింది. చీకటినుండి, చీకటి క్రియల నుండి (అపో.కా. 26:18) అంధకార సంబంధమైన అధికారము నుండి (కొలస్సీ 1:13) విడిపించి, రాజులతో కూర్చుండే (యోబు 36:6–7) ఘనత క్రిస్మస్ మనకు గ్రహించింది. ఇది ఈనాటి యువతరానికి అర్థం కాదు. పెద్ద వయస్సు గలవారి నడిగితే చెప్తారు. మన బడాయికి కారణం క్రీస్తే, క్రిస్మన్‌ని బట్టే మనం రాజులవయ్యాం. మన వ్యక్తిత్వం పెరిగింది. క్రిస్మస్, ఆత్మాభిమానాన్ని దయచేసింది. న్యూనతాభావం పోయింది. దేవుని స్తుతించే కార్యం ప్రారంభమయింది.

2. క్రిస్మస్ మనకు స్వతంత్రత / స్వేచ్ఛ విడుదల నిచ్చింది

ఒకప్పుడు పాపదాస్యానికి లోనైన వాళ్ళం. పాపంలో, పాపకూపంలో మగ్గిపోయాం. "కాబట్టి ఆపిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవారిని; అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును ఆయన కూడా రక్తమాంసలలో పాలివాడాయెను" (హెబ్రీ 2:14). పాపదాస్యమును బట్టి దాస్యమును బట్టి స్వేచ్ఛ లేదు. దాసుల గృహమైన ఐగుప్తు (ద్వితీ 6:12). నుండి తన ప్రజల్ని విమోచించినట్లుగా, క్రిస్మస్ మనలను పాపదాస్యం నుండి విడిపించింది. దీనులకు సువార్త, నలిగిన హృదయం గలవారికి దృఢత్వం, చెరలోనున్న వారికి విడుదల, బంధింపబడిన వారికి విముక్తి, 'దు:ఖానికి ప్రతిగా ఆనందతైలము భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతి వస్త్రం. వారికిచ్చుటకును ఆయన నన్ను పంపాడు. పాపపు చెరలో నుంచి ప్రజల దాస్యాన్ని పరిహరించటానికి ఆయన కూడా రక్త మాంసములలో పాలివాడైనాడు. క్రీస్తు రాకతో లభించింది. యెషయా 9:4లో ఉన్నట్లు, వారి బరువుకాడిని విరిచాడు. సోదరుడా! సోదరీ నీవింకా పాపదాస్యంలో (యోహాను 8:34) ఉంటే ఈ క్రిస్మసు రోజునైనా పాపాన్నుంచి విడుదల పొందుట మంచిది.

3. క్రిస్మస్ మనకు నీతి / న్యాయం / ధర్మం / సన్మార్గం ఇచ్చింది

నీతికి లోకమిచ్చే నిర్వచనం వేరు. పాపం చేస్తూ, అన్నదానం, గోదానం, భూదానం, వస్త్రదానం, ఈ మధ్య రక్తదాన శిబిరాలు కూడా వెలిసాయి. గుడులు కట్టించడం, గోపురాలు నిర్మిచటం, సాంఘిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం ఇవన్నీ నీతిఖాతాలోకి జమ అవుతాయి. ఆ మాటకొస్తే దొంగలకు నీతి ధర్మం / న్యాయం ఉంది. దొంగలు నిలువుదోపిడి, హుండిలో వేస్తున్నారు. దీనినే మరొక విధంగా ధర్మశాస్త్రసంబంధమైన నీతి అని బైబిల్ పేర్కొంది. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ (అడవి దొంగ)కు కూడా ఒక నీతి ఉంది. కన్నడ నటుడు రాజ్‌కుమార్‌ని 100 రోజులు చెరలో ఉంచి ఎంతో బాగా చూసుకున్నాడు. తర్వాత "మాజీమంత్రి నాగప్పన్‌ను నేను చంపలేదు. 107 రోజులు నా దగ్గరవున్నా, నేను చంపలేదు, దేవుడి మీద ప్రమాణం చేసి చెప్తున్నాను" అన్నాడు. బైబిల్ అంటుంది. "దేవుని మూలంగా (క్రీస్తు) ఆయన మనకు నీతియు, జ్ఞానమును పరిశుద్ధము నాయెను" (1 కొరింథీ 1:31). "క్రీస్తును సంపాదించుకొని, ధర్మశాస్త్రమూలమైన నా నీతిని కాక క్రీస్తు నందలి విశ్వాసము వలనైన నీతి అనగా విశ్వాసమును బట్టి దేవుడనుగ్రహించు నీతిగలవాడనై ఆయన ముందు అగుపడు నిమిత్తము ... (ఫిలిప్పి 3:9). ఈ నీతి క్రిస్మస్ ద్వారా, క్రీస్తు ద్వారా మనకు లభించింది. మనమొకప్పుడు నీతీ నియమం లేనివారం. అయితే "విశ్వసించు ప్రతి వానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియైయున్నాడు" (రోమా 10:4). మన ప్రభువు నీతి సూర్యుడు (మలాకీ 4:2). యేసును విశ్వసించే ఏ పాపి ఖాతాలోనైనా క్రీస్తు నీతి జమ చేయబడుతుంది. ప్రియులారా! క్రిస్మస్ మనకు సన్మార్గం, న్యాయం నీతి నొసగింది. "ఆయన కృపచేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతలమని తీర్చబడుచున్నాము" (రోమా 3:24). ఈ నీతి నమ్మే వారందరికి కలిగే నీతి (రోమా 3:11).

4. క్రిస్మస్ మనకు నవ్యత / నూతనత్వం / నవీనత / క్రొత్తదనం ఇచ్చింది

క్రిస్మస్ మనకు నవ్యతనిచ్చింది. క్రిస్మస్ ద్వారా శారీరక క్రొత్తదనం, ఆధ్యాత్మిక క్రొత్తదనం లభించింది. "కాగా – ఎవడైననూ క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి" (2 కొరింథీ 5:17). రక్త దాహంగల హింసకుడైన పౌలులో నూతనత్వం వచ్చింది (అపో.కా. 9:13,21); ఫిలిప్పీ జైలు అధికారిలో (అపో.కా. 16:24,33), సమరయ స్త్రీలో (యోహాను 4:17–19). గా ఉన్న దయ్యం పట్టిన (మార్కు 5:5,15) వాడిలో మార్పు వచ్చింది. మనం ఎప్పుడైతే క్రీస్తు నందు విశ్వాసముంచుతామో అప్పుడే క్రొత్తగా మారిపోతాం. మనం ఎప్పుడైతే క్రీస్తునందు విశ్వాసముంచుతామో అప్పుడే క్రొత్తగా మారిపోతాం. పరిశుద్ధాత్ముని తోడువల్ల, మారిన మన క్రొత్త జీవితపు శక్తి వల్ల పనమైన మృగప్రాయమైన

స్వభావంకంటె ఎంతో ఉన్నతంగా జీవించగలుతున్నాం. క్రిస్మస్ ఎంతో మార్పును తెచ్చింది. మనం మారిపోవాలి అంటే మారిపోము. పాపం నుంచి వైదొలగటం అంత తేలికైనది కాదు. "ఏలయనగా ప్రాచీన స్వభావమును ధరించుకొని యున్నారు" ఈ నూతన వ్యక్తిత్వం దేవుని మహాద్భుత సృష్టి (ఎఫెసీ 2:15). క్రీస్తు మనలో జన్మించడం వల్ల మనలోని ఆత్మకు శరీరానికి ప్రాచీన పురుషుడునికి, నూతన వ్యక్తికి యుద్ధం జరుగుతుంది.ర నవ్యతను మనసారా కోరితే, శరీరాశల్ని ఖండించి, వాటిని చావుదెబ్బ కొట్టాలి. మనలో అనేకులు పరిశుద్ధ జీవితం జీవించే నూతన ప్రజలయ్యారు. అట్టి మార్పు కలిగించిన క్రిస్మస్ కొరకు దేవునికి స్తుతులు చెల్లిద్దాం.

5.క్రిస్మస్ మనకు జీవము / ప్రాణము / చేతనత్వం / సజీవత నిచ్చింది

ఒకప్పుడు నిర్జీవులం, బ్రతికున్నా చచ్చినవారం. గానీ క్రిస్మస్ ద్వారా మనలో ప్రాణమొచ్చింది. "ఆయనలో జీవముండెను, ఆ జీవము మనష్యులకు వెలుగై యుండెనున" (యోహాను 1:4). విశ్వాసం ద్వారా దైవికమైన నిత్యజీవంలోకి ప్రవేశించాము. తన కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్యజీవమును పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). క్రిస్మస్ ద్వారా మనుష్యులు నూతన జన్మ, శాశ్వత జీవం పొందడానికి సాధ్యమైంది. పాపాల్లో దారి తప్పిపోయి నశించిపోతూ ఉన్న మనుష్యుల పట్ల దేవునికి కనికరం, జాలి ఉన్నాయ్, శాశ్వత జీవాన్నివ్వాలని దేవుని కోరిక. ఆ జీవాన్ని పొందాలంటే ఒకటే మార్గం. అది ఆయనలో నమ్మకముంచడమే. అపోస్తలుడైన పౌలు మాటలు గమనించండి. క్రీస్తే నా యందు జీవించుచున్నాడు. నేనిప్పుడు ... దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను" (గలతీ 2:20). ఆధ్యాత్మిక జీవానికి మూలం క్రీస్తే. యేసుక్రీస్తును తన రక్షకునిగా స్వీకరించిన వ్యక్తి ఆత్మీయ అంధకార ప్రపంచంలో నుంచి బయటకు వచ్చి దేవుని ప్రేమ వెలుగులో ప్రవేశిస్తాడు. వానిలో నూతన జీవం ఉట్టిపడుతుంది. "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని" (యోహాను 10:10). ఎవరా గొర్రెలు? ఏమిటా జీవం అని ప్రశ్నించుకుంటే, మనమే దారి తప్పిన గొర్రెలం, చచ్చిన జీవచ్ఛవాలం, మనకే ఆ జీవచ్ఛవాలం, మనకే ఆ జీవం కావాలి. అది సమృద్ధిగా కావాలి. దేవుడు ప్రపంచానికి చాలా బహుమతులిచ్చాడు. లోకాన్ని వెలుగుతో నింపడానికి సూర్యుణ్ణి, జీవితంలో మనిషి సంతోషించడానికి, స్నేహితుల్ని, బంధువుల్ని, అందమైన ప్రకృతిని ఇచ్చాడు. వికసించే పువ్వులు, పచ్చటి మొక్కలు, నిశ్చలమైన కొండలు, ఇవన్నీ మనిషి ఆనందం, అభివృద్ధి కోసమే. అయితే వీటన్నిటిని అనుభవించటానికి, ఆస్వాదించడానికి మనిషికి జీవం లేకపోతే ఎలా! పాఠకులారా! విశ్వాసపు హస్తాలు చాపి క్రీస్తుని మీ రక్షకునిగా అంగీకరించి ఆయనిచ్చిన ధన్యతలకై ఆయనను పూజించి, నమస్కరించి, దేవునికి నమస్కరించి, దేవునికి స్తోత్రం చెబుతాం.



రెవ॥ పి. జోసఫ్ జయబాబు
రావులపాలెం

# యాకోబు దేవుడు



ఉపోద్ఘాతం : ఒక వూళ్ళో అన్నమ్మనే పేదరాలుండేది. ఆమె పొలం పనులు చేసుకొంటూ పొట్ట పోసుకునేది. మాటకి పేదరాలేగాని గుణానికి గొప్పది. పొల్లాలో యేసయ్య పదాలు పాడుతూ వుండేది. ఎవరికి ఏ చిన్న కష్టమొచ్చినా వారి కోసం ప్రార్థించేది. ఇలావుండగా ఓ సారి ఆ వూళ్ళో ఓ రైతు కూతురికి జబ్బు చేసింది. ఎంతో డబ్బు ఖర్చులు పెట్టి వైద్యం చేయించినా పెద్దగా నయం కాలేదు. ఆ రైతు తన కూతురు గురించి చెప్పి అన్నమ్మనోసారి యింటికి రమ్మన్నాడు. ఆమె వెళ్ళాక ఆ యింటో ఆమె చేత యేసయ్య పాటలు కొన్ని పాడించుకున్నారు. తర్వాత జబ్బు చేసిన పాపను గురించి ప్రార్థన చేసింది. ఆశ్చర్యమేమిటంటే, గడ్డు రోగమనుకొన్నది కాస్త మటుమాయమై పోయింది. ఇక తండ్రి ఆనందాన్ని మాటల్లో వర్ణించలేమంటే నమ్మండి. కనిపించిన వారికెల్లా 'మా పాపను అన్నమ్మ దేవుడు బాగుచేసాడు' అని చెప్పుకోవడం మొదలు పెట్టాడు. ఇలా కొన్నాళ్ళు గడిచాయో లేదో ఆ రైతుకు అన్నమ్మ దేవుడిపై నమ్మకం కుదిరింది. అప్పట్నుంచి అన్నమ్మ దేవుడే నా దేవుడు అని సాక్ష్యమివ్వడం ప్రారంభించాడు. ఈ అద్వితీయుడైన సత్యదేవుడే పాత నిబంధన కాలంలో 'యాకోబు దేవుడు' అని పిలిపించుకోవడానికి కూడా ఇష్టపడ్డాడు యాకోబు అంటే మోసగాడు అని ఒక అర్థం. దీన్ని బట్టి యాకోబు దేవుడు అంటే మోసగాళ్ళ దేవుడనే కదా! ఇలా పిలిపించుకోవడంలో దేవుని ఉన్నతమైన ప్రేమ ఇమిడివుంది. ఆ లెక్కకొస్తే ఈ లోకంలో మోసం చేయని దెవరు?

అందరూ స్వాభావికంగా పాపులే, పాపులను రక్షించడానికే యాకోబు దేవుడు యేసుగా ఈ లోకంలో అవతరించాడు.

ఓ సారి యాకోబు దేవుడు యాకోబు బావి దగ్గర కూర్చుని వున్నాడు. అప్పుడొక సమరయ స్త్రీ నీళ్ళు చేదుకోవడానికి అక్కడికి వచ్చింది. ఇద్దరికీ మాటా మాటా కలిసింది. ఈ బావి నీళ్ళు త్రాగి మాకిచ్చిన మన తండ్రియైన యాకోబు కంటె నీవు గొప్పవాడివా? (యోహాను 4:12). అని ఆయన్ని అడిగింది. ఆయన యాకోబు దేవుడని తెలియక ఆమె అలా అడిగింది గాని యాకోబు దేవుడు యాకోబు కంటె గొప్పవాడు కాదా! ఆయన గొప్ప తనాన్ని కొంత మట్టుకు కీర్తన 146లో చెప్పబడింది. "ఎవనికి యాకోబు దేవుడు సహాయుడగునో, ఎవడు తన దేవుడైన యెహోవా మీద ఆశపెట్టుకొనునో వాడు ధన్యుడు" కీర్తన 146:5. యాకోబు దేవుడైన యేసును నీవు నమ్ముకొంటే ఆయన నీకూ దేవుడవుతాడు. నీకు మాత్రమే కాదు. ఆయన్ను నమ్ముకొన్న ప్రతి ఒక్కరికీ దేవుడైయుండి యాకోబును ఆశీర్వదించినట్లే అందరినీ ఆశీర్వదించాలనేది ఆయన సంకల్పం. ఇంతకీ యాకోబు దేవుడు యాకోబుకు చేసిందేమిటి? కొన్ని సంగతులు ధ్యానిద్దాం.

1. బేతేలు అనుభవం : (1) ఒంటరితనం – సహవాసం : యాకోబు బెయెర్షెబా నుండి బయలుదేరి హారాను వైపు వెళ్తున్నాడు (ఆది 28:10). తాను ఎరుగని ప్రాంతానికి తాను ఎరుగని ప్రజల మధ్యకు చేస్తున్న ప్రయాణికుడికి ఎందుకిలా జరిగింది? యాకోబు తన తండ్రియైన ఇస్సాకును మోసం చేసి తన అన్నయైన ఏశావునకు రావలసిన దీవెనలు తాను పొందుకున్నాడు. దీంతో ఏశావు యాకోబు మీద పగ పట్టాడు. చంపెయ్యాలన్నంత కోపంతో ఉన్నాడు. ఈ సంగతి తెలిసి తల్లియైన "రిబ్కా" యాకోబును తన సహోదరుడైన లాబాను నొద్దకు పారిపొమ్మని పురికొల్పింది. తండ్రి

"సెలవు"తో యాకోబు ప్రయాణమై వెళ్తూండగా ఓ చోటికి చేరేటప్పటికి పొద్దు గ్రుంకింది. ఆ రాత్రికక్కడే నిలిచిపోయి ఆ చోటిలో రాళ్ళతో ఒకటి తలగడగా చేసికొని పడుకొన్నాడు. ఆ చీకటి వేళలో ఒంటరితనంలో అమ్మనీ, నాయన్నీ, తక్కిన తన వాళ్ళందర్నీ తలుచుకొంటూ ఎంత ఏడ్చివుంటాడో కదా! ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లినట్లు నిద్రలోకి జారుకొని వుంటాడు. అప్పుడతనికో కల వచ్చింది. ఆ కలలో ఓ నిచ్చెన భూమి మీద నిలపబడి వున్నట్లు చూసాడు. దానికొన ఆకాశాన్నంటింది. దాని మీద దేవదూతలు ఎక్కుతూ దిగుతూ వున్నారు. దానికి పైగా దేవుడైన యెహోవా నిలిచివున్నాడు. "యాకోబూ! నీవు ఒంటరివి కాదు. నా దూతల సహవాసాన్ని నీకిస్తున్నాను. నా కనుదృష్టి నీ మీద ఉంది. అని దేవుడు ధైర్యపరుస్తున్నట్లు కలలో ఈ దృశ్యాన్ని చూస్తున్నాడు. అవును, యాకోబు దేవుడు నీ దేవుడైతే నీ పేదరికంలో, నీ అనారోగ్య పరిస్థితుల్లో, నీ సమస్యల్లో, నీ ఒంటరి తనంలో నీకు తోడైయుంటాడు. తన దూతల సహవాసాన్ని నీకిస్తాడు. "నీ మార్గములన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును. నీ పాదములకు రాయి తగులకుండ వారు నిన్ను తమ చేతుల మీద ఎత్తి పట్టుకొందురు" కీర్తన 91:11,12.

జాన్ పేటన్ అనే మిషనరీ హెబ్రిడీస్ దీవుల్లో ఉన్న రోజుల్లో జరిగిన ఓ సంఘటన – ఒక రోజు రాత్రి ఆటవికులలో కొందరు పేటన్ దంపతులు ఉంటున్న ఇంటిని తగులపెట్టి వారిని హతమార్చాలని తలపెట్టారు. ఈ సంగతి తెలిసిన ఆ దంపతులు తమ ఇంటిలో రాత్రంతా కన్నీటితో ప్రార్థించారు. తెల్లారిపోయింది. అనుకొన్నట్లు ఎవరూ రాలేదు. ఏ హానీ చెయ్యలేదు. ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. ఆటవిక నాయుడొకడు యేసును నమ్ముకొన్నాడు. పేటన్ ఆవ్యక్తిని ఆనాటి రాత్రి ఎవరూ రాకపోవడానికి గల కారణమేమిటని అడిగాడు. అప్పుడతడు చెప్పింది విన్న పేటన్ దంపతుల ఆశ్చర్యానికి అవధుల్లేవు. దేవుణ్ణెంతగానో స్తుతించారు. ఇంతకీ జరిగిందేమిటంటే, ఆ రాత్రి పేటన్ ఇంటి చుట్టూ తెల్లని దుస్తులు ధరించి ఆయుధాలు పట్టుకొని కాపలా కాస్తున్నట్లు కొందరు కనిపించడంతో వస్తున్న వాళ్ళు భయపడి వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. దేవునికి స్తోత్రం! ఒంటరి తనంలో తన దూతల సహవాసాన్ని అనుగ్రహించువాడు యాకోబు దేవుడు.

2. శాపం – ఆశీర్వాదం : యాకోబు నా అనుకున్న వాళ్ళందర్నీ విడిచిపెట్టి ప్రాణాన్ని దక్కించుకోవడానికి భయంతో ఒంటరిగా పారిపోతున్నాడు. ఇది తన జీవితానికి ఒక శాపంగా భావించి వుంటాడు. అయితే దేవుడైన యెహోవా తన్ను అబ్రహాము ఇస్సాకుల దేవునికిగా పరిచయం చేసుకొంటూ అబ్రహాముతో చేసిన వాగ్దానాలను యాకోబుతో స్థిరపరుస్తున్నాడు. అతడు పడుకొన్న ఆ భూమిని అతనికీ అతని సంతానానికి ఇస్తానని, అతని సంతానం నలుదిక్కులా వ్యాపిస్తుందని, అతని మూలంగానూ, అతని సంతానం మూలంగానూ లోకంలో ఉన్న వంశాలన్నీ ఆశీర్వదింపబడతాయని దేవుడు చెప్తున్నాడు. ఎంత ఆశ్చర్యం! అవును, యాకోబు దేవుడు నీ దేవుడైతే నీ జీవితంలో శాపమనుకొన్నది సైతం ఆశీర్వాదంగా మార్చగలవాడాయన. శాపాన్ని ఆశీర్వాదంగా మార్చగలవాడు యాకోబు దేవుడు.

3. భయం – అభయం : యాకోబు తానున్న పరిస్థితులను తలంచుకొంటూ ఎంత భయపడి వుంటాడో కదూ! అయితే – "ఇదిగో, నేను నీకు తోడుగా ఉంటాను. నీవు వెళ్ళే ప్రతి స్థలంలో నిన్ను కాపాడుతూ, నిన్ను ఈ దేశానికి తిరిగి వచ్చేలా చేస్తాను. నేను నీ చెయ్యి విడవకుండా నీతో చెప్పిన మాట నిలబెట్టుకొంటాను" అని దేవుడు యాకోబుకు అభయమిస్తున్నాడు (ఆది 28:15 చూడండి). వాగ్ధానం చేసినవాడు నమ్మదగినవాడు. "మనము నమ్మదగనివారమైనను, ఆయన నమ్మదగినవాడిగా ఉండును; ..." 2 తిమోతి 2:13. ఈ లోకంలో మనుషులు అప్పుడే మాటయిస్తారు. అంతలోనే మాటమారుస్తారు. అప్పుడే ప్రేమిస్తున్నట్లుంటారు. .. ఆ వెనువెంటనే ద్వేషిస్తారు. అయితే ప్రభువలా కాదు. మాట యిస్తే నెరవేరుస్తాడు. ఆయన ఎన్నటెన్నటికీ నమ్మదగినవాడు. ... శాశ్వతమైన ప్రేమతో ప్రేమించువాడు. యాకోబు మేనమామయైన లాబాను మొదట్లో యాకోబును ప్రేమతోనే చేర్చుకొన్నట్లు అనిపిస్తుంది. అయితే యాకోబే మోసగాడనుకొంటే, లాబాను మోస గాళ్ళకు మోసగాడు అన్నట్లు అతని పనులు కనిపిస్తాయి. కొంత కాలం గడిచేటప్పటికి లాబాను యాకోబును ఒకప్పటిలా ప్రేమించడం లేదన్న విషయం యాకోబు మాటల్లోనే చూద్దాం. 'మీ తండ్రి కటాక్షము నిన్న మొన్న నా మీద ఉండినట్లు ఇప్పుడు నా మీద నుండలేదని నాకు కనబడుచున్నది; అయితే నా తండ్రి యొక్క దేవుడు నాకు తోడైయున్నాడు, నిన్ను ఎన్నటికీ ఎడబాయని వాడు ప్రభువు అనే నిశ్చయత నీకుంటే ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను అని మంచి ధైర్యంతో చెప్పగలవు. అవును భయంతో అభయాన్నిచ్చేవాడు యాకోబు దేవుడు.

4. పాడైన స్థలం – దేవుని మందిరం : యాకోబు నిద్ర లేచాడు. చాలా భయపడిపోయాడు. పరలోకపు గవిని ఇదే అనుకొన్నాడు. తెల్లారాక తాను తలగడగా చేసికొనిన రాయి తీసి దాన్ని స్థంభంగా నిలిపాడు. దాని కొనమీద నూనె పోయుటను బట్టి ఆ స్థలాన్ని దేవునికి ప్రతిష్ఠించినట్లయింది. అతడు ఆ స్థలానికి 'బేతేలు' అని పేరు పెట్టాడు. బేతేలు అంటే దేవుని మందిరం అని అర్థం. అవును, యాకోబు దేవుడు నీ దేవుడైతే ఒకప్పుడు నీ జీవితం ఎంత పాప పంకిలమైందైనా దాన్ని తన మందిరంగా మలుచుకొంటాడు. "మీరు దేవుని ఆలయమైయున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" 1 కొరింథీ 3:16 ఇట్టి అనుభవం పాడైన జీవితాన్ని తన మందిరంగా మలుచుకొనువాడు యాకోబు దేవుడు.



**ప్రతి శుక్రవారం**
**సాయంత్రం 6:30 గంటలకు**
**శుభవార్త ఛానల్‌లో**
**ప్రతి సోమవారం**
**రాత్రి 10:00 గంటలకు**
**రక్షణ ఛానల్‌లో** మరియు **తిరిగి బుధవారం**
**మధ్యాహ్నం 2:00 గంటలకు ప్రసారం కాబడు**
**మేలుకొలుపు స్వరం**
**వీక్షించండి**

2. మహనయీము అనుభవం : యాకోబు తన భార్యా పిల్లలను, దాసదాసీ జనాన్ని, తనకు కలిగిన సమస్తాన్ని తీసికొని స్వదేశానికి తిరుగు ప్రయాణం కట్టాడు. సమృద్ధి గలవాడిగా వెళ్తున్నాడన్న మాటే గాని లోపల మాత్రం భయం భయం. మనసులో నెమ్మది లేదు. ఏదో అశాంతి, అలజడి, ఆందోళన ఏమిటిదంతా? తన అన్నయైన ఏశావు సేవకులతో వచ్చి అమాంతం మీదపడి చంపు తాడేమోనన్న భయం యాకోబును నిలువునా కంపింపజేస్తుంది. అతన్ని ధైర్యపర్చడానికి అన్నట్లు అతన్ని ఎదుర్కోవడానికి దేవుడు తన దూతలను పంపాడు "యాకోబు వారిని చూచి – ఇది దేవుని సేన అని చెప్పి ఆ చోటికి మహనయీము అను పేరు పెట్టెను" ఆది 32:2. మహనయీము అంటే రెండు సేనలు అని అర్థం. యాకోబు సేనకు దేవుని సేన తోడయ్యింది కదూ! అయిననూ యాకోబు జీవితంలో ఏదో వెలితి కేవలం ఈ లోక సంబంధమైన సమృద్ధి వల్ల నిజమైన శాంతి సమాధానాలు సాధ్యం కావు. అవి జీవితానికి సార్థకత చేకూర్చలేవు అని తెలుసుకొన్నాడు. అంత మాత్రమే కాదు, తాను దేవుని నుండి పొందవలసిన అసలైన ఆశీర్వాదం, అంటే పరమాశీర్వాదం, ఒకటుందనే పరమసత్యాన్ని గ్రహించాడు. దేవునికి స్తోత్రం!

3. పెనూయేలు అనుభవం : అది యాకోబు జీవితంలో అత్యంత విశేషమైన రాత్రి తనకున్నదంతా తన కంటె ముందు పంపించేసాడు. తనకున్నదంతా తనదికాదు అన్నట్లు 'యాకోబు ఒక్కడు మిగిలిపోయాడు'. ఇలాంటి సమయం కోసమే దేవుడు ఇంత దాకా వేచివున్నాడు. ఒక నరుడు తెల్లవారు వరకు అతనితో పెనుగులాడెను' అని ఆది 32:24లో చూడగలం. ఎవరీ నరుడు? ఈయన్ని గూర్చి ఆది 32:28లో దేవుడు అని పేర్కొనబడింది. అంటే ఈయన దైవనరుడన్న మాట. దేవమానవుడన్నా, మానవ దేవుడన్నా ఒక్కడే. ఆయన ప్రభువైన యేసు. దేవుని స్తోత్రం! ఎప్పటికీ ఆయన యాకోబును గెలవకుండుట చూచి తొడగూటి మీద అతన్ని కొట్టాడు. తొడ గూడు వసిలిపోయింది. తెల్లవారుతోంది కాబట్టి తన్ను పోనిమ్మని ఆయన అంటున్నాడు. నీవు నన్ను ఆశీర్వదించితేనే గాని నిన్ను పోనియ్యనని యాకోబు చెప్తున్నాడు. ఈ ప్రార్థనా పోరాటంలో యాకోబు కనుపర్చిన పట్టుదల మనకు ఆదర్శప్రాయం. 'నీ పేరేమ'ని ఆయన అడిగిన ప్రశ్నకు అతడు 'యాకోబు' అని చెప్పాడు. తద్వారా అతని హృదయస్థితిని అతని నోటితోనే చెప్పించినట్లయింది. యాకోబు తన మోసపు జీవితాన్ని బట్టి పశ్చాత్తాపంతో ప్రాధేయపడుతున్నాడని గ్రహించాలి. అప్పుడు ఆయన – నీవు దేవునితోను మనుష్యులతోను పోరాడి గెలిచితివి గనుక ఇక మీదట నీ పేరు ఇశ్రాయేలేగాని యాకోబు అనబడదని చెప్పాడు. అప్పుడు యాకోబు – 'నీ పేరు ఎందు నిమిత్తము నా పేరు అడిగితివని చెప్పి అక్కడ అతని నాశీర్వదించాడు". యాకోబు ఆ స్థలాన్ని పెనూయేలు అని పేరు పెట్టాడు. పెనూయేలు అంటే దేవుని ముఖం అని అర్థం ఒక ప్రక్క తొడకుంటుతూ నడుస్తున్నాడే గాని హృదయంలో అంతకుముందెన్నడూ లేని ఆనందం, పరమానందం. ఇది పరమాశీర్వాదం పొందుకోవడం వల్ల వచ్చిన దివ్యానందం. దీనికి మరే ఆనందం సాటిరాదు. అందుకే 'పరమాశీర్వాదము కోరి పరలోక పితా అరుదెంచితిమి' అని పాడుతూ ఉంటాం. ఈ లోకంలో ఏది ఉన్నా, ఏది లేకపోయినా ఫర్వాలేదు గాని ఈ పరమాశీర్వాదం పొందుకోవడంతోనే జీవితానికి సాఫల్యత చేకూరుతుంది. ఇటువంటి అనుభవం నీకుందా?

ముగింపు : ఒక ప్రాముఖ్యమైన సంగతి గమనించాలి. యాకోబుకు పరమాశీర్వాదమిచ్చిన ఆ మహిమాన్వితుడు తన పేరును వెల్లడిపర్చినట్లు కన్పించదు. ఆయన పేరు అప్పటికి చెప్పశక్యం కానిదని భావించాలి (న్యాయా 13:18 చూడండి). దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించాడు గనుకనే తగిన కాలమందు యాకోబు దేవుడే "యేసు" ఈ లోకములో అవతరించాడు. "యేసు" అంటే రక్షకుడు అని అర్థం. ఆయన అనుగ్రహించే ఆశీర్వాదమే 'రక్షణ' చెప్పశక్యం కాని వరం. యాకోబు పెనూయేలులో పొందిన ఆశీర్వాదానికి ఇది వాస్తవ రూపం. ఒక తండ్రి తన చంటి బిడ్డలతో పోరాడి (ప్రేమతో) ఓడిపోవడానికి యిష్టపడినట్లే ప్రభువు కూడా తన్ను ఆశ్రయించు వారి యెడల అత్యున్నతమైన కృపగల వాడైయున్నాడు. సిలువ పాదాలు పట్టుకొని పశ్చాత్తాపంతో పట్టుదల కలిగి ప్రాధేయపడితే, ఎంత ఘోరపాపినైననూ కనికరించి క్షమిస్తాడు. రక్షణాశీర్వాదంతో అలంకరిస్తాడు. అట్టి కృపతో దేవుడు మిమ్మును వర్థిల్ల చేయును గాక!






# లిటిల్ హార్ట్స్
## (పసి హృదయాలు)

ఒక చిన్న కుగ్రామములో ఒక చిన్న వ్యవసాయ కూలీ ఉండేవాడు. అతనికి చిన్న కుటుంబం ఉంది. అతను ప్రతి రోజు పొలంలో ఏదో కూలిపనికి వెళ్ళి కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతను చాలా అమాయకుడు. మంచివాడు. ఎవరు ఏ పని చెప్పినా చేసేవాడు. అతను ఆ ఊరిలో అందరికీ తెలిసినవాడు.

ఒక రోజున (వేసవి కాలంలో) పొలంలో గునపం పట్టుకొని గుంజలు నాటడానికి రంధ్రాలు తీస్తూ, ఒకొక్కసారి గునపం ప్రక్కన పెట్టి చేతితో మట్టిని లాగుతూ ఉన్నాడు. పని అయిన తరువాత గునపం (గెడ్డపార)ను పట్టుకున్నాడు అంతవరకు ఆ ఇనుము పనిముట్టు ఎండలో ఉందేమో అతను పట్టుకోగానే, అది చాలా వేడిగా కాలిపోతుంది. వెంటనే అనుకున్నాడు. అయ్యో ఎంత కష్టపడి పనిచేసిందో నేనైతే ఎండలో పనిచేస్తున్నానని మజ్జిగ అన్నం తిని, నీళ్ళు తాగుతూనే ఉన్నాను. కాని ఈ గునపం ఏమి తినలేదు కదా! అందుకే దీనికి చాలా జ్వరం వచ్చేసింది అని అనుకొని వెంటనే సైకిల్ మీద గునపం పట్టుకొని డాక్టరు గారి దగ్గరకు వెళ్ళిపోయాడు. డాక్టరుగారు కంగారు పడి ఏమైందిరా అని అడగగానే, ఏమండీ! నా గునపంకు జ్వరం వచ్చింది. ఏమైనా ముందు ఉంటే ఇవ్వండి. దీనికి రాస్తాను. దీంతో చాలా పనుంది అని చెప్పాడు.

డాక్టరుగారు మనస్సులో నవ్వుకొని, నీవు ఏమి దిగులుపడకు. మంచి మందు ఉంది. నీవు వెళ్ళే దారిలోనే మన ఊరి కాలువ ఉంది కదా అది మందులతో తయాచేసిన నీరు కనుకనే మన పంటలు బాగా పండుతాయి. కనుక ఆ గెడ్డపార తీసుకొని వెళ్ళి కొద్దిసేపు ఆ కాలువలో వేయి. పది నిమిషాల తరువాత తీసెయ్యి. వెంటనే దీనికి ఉన్న జ్వరం తగ్గిపోతుంది. అని చెప్పగానే ఎంతో సంతోషముగా ఆ గెడ్డపారను తీసుకొని కాలువ దగ్గరకి వెళ్ళి దానిలో వెయ్యగానే కొద్ది సేపటికి అది చల్లగా అయిపోయింది. ఎంతో సంతోషంగా దానిని తీసుకొని ఇంటికి వెళ్ళిపోయాడు. అలాగే తన జీవనం సాగిస్తున్నాడు.

కొన్ని రోజులు తరువాత తన భార్యకు చాలా జ్వరం వచ్చింది. అస్సలు లేవలేకపోతుంది. చలి జ్వరంతో బాధపడుతుంది. తన భర్త ఆమెను తాకి చూసాడు. చాలా కాలిపోతుంది. వెంటనే మనస్సులో నవ్వుకున్నాడు. వెంటనే సైకిల్ తీసాడు. తన భార్యను పిలిచి రా కూర్చో, నీ జ్వరం అంతా పదేపది నిమిషాలలో పోగొడతాను అన్నాడు. భార్య అనుకొంది డాక్టరు దగ్గరకేమో అని కాని సైకిల్ మీద తిన్నగా భార్యను కాలువకి తీసుకెళ్ళి, కాలువలోకి నెట్టివేసాడు. ఆమె నీటిలో పడిపోయి, ఏమైందయ్యా నీకు అని లేచి వచ్చేస్తుంటే అది కాదు కొంచెంసేపు నీటిలో పడుకో అని చెప్పి బలవంతంగా నొక్కి పెట్టాడు. పది నిమిషాల తరువాత తన భార్యను లేవమని చెప్పాడు. జ్వరం పోయే ఉంటుంది ఇక లెగు అన్నాడు. ఆమె లేవలేదు. ఏమైందో చూసాడు. ఇంకేముంది ఆమె నీరు తాగి ఊపిరి ఆడక చనిపోయింది.

పిల్లలూ! నవ్వు వచ్చిందా! అవును "జ్ఞానములేని వాడు ప్రతి మాట నమ్మును" సామెతలు 14:15. మీరు మాత్రం ఫ్రెండ్స్ ఏది చెప్పినా అది మంచిదో కాదో, ఎవరు ఏది చెప్పిన జ్ఞానుల వలె, యోగ్యమైనది తెలుసుకోండి ఉంటాను. ప్రభువారు మిమ్మును దీవించును గాక!


**ఇమ్మానుయేలు స్వస్థత గృహముల ఆరాధన వివరములు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ఆదివారం | ఉదయం | 10:00 | నుండి | 2:00 గంటల వరకు | : | ఆరాధన | - | కుంచనపల్లి |
| ఆదివారం | సాయంత్రం | 700 | నుండి | 8:30 గంటల వరకు | : | ఆరాధన | - | హౌసింగ్ బోర్డ్ |
| ఆదివారం | రాత్రి | 8:30 | నుండి | 10:30 గంటల వరకు | : | ఆరాధన | - | పాతూరు, తాడేపల్లిగూడెం |
| శుక్రవారం | ఉదయం | 10:00 | నుండి | 3:00 గంటల వరకు | : | స్వస్థత ఉపవాస ప్రార్ధన | - | కుంచనపల్లి |


24 గంటల ప్రార్ధన శిబిరము, ఫోన్స్ : 9849184346, 9177496764




క్రీస్తు జన్మదిన సంకేతంగా సంఘంతో, కుటుంబంతో క్రిస్మస్ కేక్ కటింగ్




క్రీస్తు జన్మదిన సంగీత గానాలతో క్రిస్మస్ వేడుక




నిరుపేద నిర్భాగ్యులకు మధ్య క్రిస్మస్ సంతోషం




వీధుల్లోనే బ్రతుకు వెళ్ళదీస్తున్నవారికి క్రిస్మస్ కానుకలు పండ్లు, మిఠాయిలు, దుప్పట్ల పంపిణీ